## నేరము శిక్ష

# తోకచుక్క

ఆదిత్య

**"ఎడమ చెయ్యి ఎత్తి పెట్టి, భుజం మీదుగా కెమెరా వైపు ఏటవాలుగా చూడాలి... సరేనా...?" అంటూ సూపర్ మోడల్ కామినికి సజెషన్ ఇచ్చి కెమెరాలోంచి వ్యూ చూడసాగాడు యాడ్ ఫోటోగ్రాఫర్ మనోజ్ ఖత్రి.**

**అతని సూచనల మేరకే ఫోజిస్తూ కెమెరాకేసి చురుక్కున చూసింది కామిని. మనోజ్ ఆ ఫోజు చూసి అసంతృప్తిగా పెదవి విరిచాడు. కామిని దగ్గరగా వచ్చి..**

**"యెద ఇలా పొంగించాలి. అందరి దృష్టి యెద పొంగులపై నిలవాలి. ఇది బ్రా అడ్వర్‌టైజ్‌మెంట్ అని మరవొద్దు" అని మరోసారి ఫోజు చూపించాడు.**

అరగంట సేపు రకరకాల యాంగిల్స్‌లో కామిని అందాలను తన కెమెరాలో బంధించాడు మనోజ్.

కామిని కూడా చాలా స్వేచ్ఛగా కెమెరాకు ఫోజులిస్తోంది. వాళ్లిద్దరూ అలా ఫోటో సెషన్‌లో వుండగా అంజలి అక్కడకు చేరి....

"ఓ.. ఐయామ్ సారీ మీ ఇద్దరి ఏకాంతాన్ని భంగం చేసానా?" అంది వెటకారంగా.

ఆ మాటలు వింటూనే మనోజ్ కోపంగా "సిల్లీగా మాట్లాడకు. ఇద్దరం ఒకే ప్రొఫెషన్‌లో వున్న వాళ్లం. అంత మాత్రాన ఇలా అవాకులు, చవాకులు మాట్లాడ్డం సంస్కారం అనిపించుకోదు" అన్నాడు.

"ఓహ్...నాకు సంస్కారం గురించి క్లాసు తీసుకుంటున్నావా? ముందు మూడొంతులు వంటి మీద గుడ్డలు లేకుండా ఫోజులిస్తోందే మిస్ కామిని ఆమెకు నేర్పించు పాఠాలు.." అంది విసురుగా.

కామిని నొచ్చుకుంటూ... "మనోజ్...నే వెళ్లొస్తాను...తర్వాత కలుస్తాను" అంటూ డ్రస్ సరిచేసుకొని, మేకప్ కిట్ చేతిలో పట్టుకొని గబగబా వెళ్లిపోయింది.

అలా చూస్తూ ఉండిపోవడం మినహా మరేం చేయలేకపోయాడు మనోజ్.

కాసేపయ్యాక "అంజలీ... నా ప్రొఫెషన్ నీకు తెలుసు కదా? అందమైన అమ్మాయిలతో కలిసి పని చేయడం నా వృత్తిలో భాగం. నువ్వు ఫిలిం జర్నలిస్టువి. నువ్వు కూడా హీరోల చుట్టూ తిరుగుతుంటావు. అయినా నేనేనాడు నిన్ను నిలదీయలేదు" అంటూ ఏదో చెప్పబోయాడు మనోజ్.

"ఇచ్చిన లెక్చర్ చాలు గాని, ఈ పూట ఏమన్నా మేసేది వుందా లేదా?" అంటూ విసురుగా కిచెన్‌లోకి వెళ్లిపోయింది అంజలి.

ఉక్రోషంతో సోఫాలో కూలబడిపోయాడు మనోజ్. పెళ్లయి నిండా రెండేళ్లు కాలేదు. ఇలా ఎడమొగం, పెడ మొగంగా మారిన సంసారాన్ని తలుచుకొని కుమిలిపోయాడు.

* * *

"నువ్వు ఓ స్త్రీవై వుండి సాటి స్త్రీ మీద నిందలు వేస్తావా? నీలాంటి రాక్షసికి ఇదే తగిన శిక్ష. నువ్వు చావాల్సిందే..." అంటూ తుపాకీ గురిపెట్టి కాల్చాడు అతను. కెవ్వున కేక వేస్తూ ఆ అమ్మాయి నేలకొరిగింది. 'కట్....కట్' అంటూ డైరక్టర్ చెప్పడంతో సెట్లో లైట్లు వెలిగాయి.

హీరో కార్తీక్ రిలాక్స్‌డ్‌గా తన చెయిర్‌లో కూర్చున్నాడు. ఎప్పుడెప్పుడు అతను ఫ్రీ అవుతాడా? ఎప్పుడు అతనితో ఇంటర్వ్యూ తీసుకుందామా? అని ఎదురు చూస్తున్న అంజలి కార్తీక్‌ని కలిసి

"ఐయామ్ అంజలి. బాలీవుడ్ మ్యాగ్జిన్ రిపోర్టర్ని. మిమ్మల్ని ఇంటర్వ్యూ చేద్దామని చాలా సేపటి నుంచి ఎదురు చూస్తున్నా..."

ఇప్పుడిప్పుడే హీరోగా ఎదుగుతున్న కార్తీక్‌కు ప్రెస్ పబ్లిసిటీ చాలా అవసరం. అందుకే అంజలి ఇంటర్వ్యూ అనగానే వెంటనే సరేనన్నాడు. కానీ...'ఇక్కడ కాదు నా పర్సనల్ మేకప్ రూమ్‌లో' అన్నాడు. కార్తీక్ మేకప్ రూమ్‌లో కూర్చున్నారిద్దరూ.

అంజలి అడుగుతున్న ప్రశ్నలన్నింటికీ చిలిపిగా సమాధానాలు ఇస్తున్నాడు.

"మీకు ఇష్టమైన ప్లేస్?"

"డార్క్‌రూమ్..."

"మీ కిష్టమయిన గెస్ట్?"

"పేయింగ్ గెస్ట్"

"మీకిష్టమైన ఫుడ్?"

"ఆకలేసినప్పుడా? ఆకలేయనప్పుడా?" అని ప్రశ్నించాడు కార్తీక్.

ఆ సమాధానం వింటూనే పగలబడి నవ్వసాగింది అంజలి. ఆ నవ్వుతో శృతి కలిపి నవ్వసాగాడు.

ఇద్దరూ అలా నవ్వుల్లో మునిగి వున్నప్పుడు ఆ రూమ్ తలుపులు భళ్లున తెరుచుకున్నాయి. కామిని అక్కడకు చేరుకొని...

"ఓహ్...అంజలీ...కార్తీక్‌తో నీ ఏకాంతాన్ని భంగం చేసానా? సారీ... ఎంజాయ్... కార్తీక్.." అంటూ వెనక్కి వెళ్లబోయింది.

కామిని మాటలకు నిశ్చేష్టురాలై వింటున్న అంజలి ఒక్కసారిగా తేరుకొని.... "కామినీ నోటికొచ్చినట్లు వాగకు. నేను కార్తీక్‌ను ఇంటర్వ్యూ చేస్తున్నాను."

"ఓహ్...ఇలా నాలుగ్గోడల మధ్య రహస్యంగా ఇంటర్వ్యూ చేయాల్సిన అవసరమేమొచ్చింది? బయట ఆరుబయట సెట్లోనే చేయొచ్చుగదా" అంది వెటకారంగా.

"కామిని...నువ్వెందుకలా మాట్లాడుతున్నావో నాకర్థమైంది. నిన్న నిన్ను అన్నాననేగా...నా మాటలు నాకప్పు చెబుతున్నావు. నీ మనసులో ఏమన్నా వుంటే ఇంటి దగ్గర అను కానీ, ఇలా నలుగురి ముందు నా పరువు తీయకు..." అంజలి అలా బ్రతిమాలుతున్న ధోరణిలో అంటున్నా కామిని వినలేదు. పైపెచ్చు మరింతగా రెచ్చిపోయేలా కామెంట్స్ చేయసాగింది.

సహనం నశించిన అంజలి.."ఇవాళ నీ అంతు చూస్తాను. ఇరవై నాలుగ్గంటలు టైమిస్తున్నాను. నీ జీవితానికిదే ఆఖరి రోజు..." అంటూ వార్నింగ్ ఇచ్చి గబగబా వెళ్లిపోయింది.

"సారీ కార్తీక్...ఏవీ అనుకోకే" అంటూ కామిని అక్కడి నుంచి నిష్క్రమించింది.

* * *

మరునాడు ఉదయం 'బాలీవుడ్ మ్యాగ్జిన్' పత్రికలో కామిని ఆత్మహత్య అన్న శీర్షిక కింద వార్త ప్రచురింపబడి వుంది.

జుహులోని కామిని ఫ్లాట్‌కు చేరుకున్నాడు

ఎస్ఐ శివాజీ గైక్వాడ్. కంప్యూటర్ ఛైయిర్‌లో తల వెనక్కి వాల్చి వుంది. కణతల దగ్గర బుల్లెట్ గాయం కనిపిస్తోంది. ఎడం చేతిలో రివాల్వర్ వుంది. కంప్యూటర్‌పై సూసైడ్ నోట్ కనిపిస్తోంది. టేబుల్ మీదే కామిని డైరీ కూడా వుంది. ఎస్ఐ శివాజీ గదినంతా క్షుణ్ణంగా పరిశీలించాడు. బాల్కనీ కిటికీ తెరిచి వుంది. విషయం తెలిసిన వెంటనే కార్తీక్ అక్కడకు చేరుకున్నాడు. సాయంత్రం తన ముందే జరిగిన కామిని, అంజలిల ఘర్షణ గురించి వివరించాడు.

శవాన్ని పోస్టుమార్టంకు పంపిస్తూ ''ఇది ఖచ్చితంగా హత్యే...'' అన్నాడు.

''అదెలాగంటారు సార్?'' అడిగాడు అసిస్టెంట్ బాబూరావ్.

''కామిని కుడి కణతకు బుల్లెట్ గాయమైంది. కాని రివాల్వర్ ఎడమ చేతిలో వుంది. టేబుల్ మీద డైరీలో ఏమీ రాయలేదు కాని సూసైడ్ నోట్ కంప్యూటర్ స్క్రీన్‌పై కనిపిస్తోంది. పేపర్ మీద రాస్తే రైటింగ్ గుర్తిస్తారని హంతకుడు తెలివిగా సిస్టమ్‌లో ఫీడ్ చేశాడు.'' అన్నాడు శివాజీ గైక్వాడ్.

''అయితే, ఈ హత్య అంజలి చేసుండొచ్చు సార్'' అంటూ అనుమానం వ్యక్తం చేసాడు కార్తీక్. ఆ వెంటనే కామిని హత్య గురించి కార్తీక్ కథనం అంటూ అన్ని టీవీ ఛానళ్లలో లైవ్ ప్రసారం మొదలైంది. ముంబాయిలో అందరూ కార్తీక్ చెప్పేదాన్ని ఆసక్తిగా వినసాగారు.

* * *

అంజలి సిస్టమ్ ముందు కూర్చుని హీరో కార్తీక్‌తో జరిపిన ఇంటర్వ్యూను ఫెయిర్ చేస్తోంది. కానీ, ఆమె మనసంతా ఆందోళనతో నిండి వుంది. కామిని ఆత్మహత్య వార్త విన్నప్పటి నుంచి అంజలి బాగా అప్‌సెట్ అయింది. ఏదో నోటి దురుసుతనంతో అన్నది కానీ కామిని నిజంగా చచ్చిపోవాలనుకోలేదు. అలా పరధ్యానంగా వుండగా మనోజ్ అక్కడకు చేరుకున్నాడు.

''ఇప్పుడు నీకు ప్రశాంతంగా వుందా? నీ సూటిపోటి మాటలతో ఓ అమాయకురాలి ఉసురు తీసావు...'' అంటూ నిందారోపణ చేసాడు.

''మనోజ్...అనవసరంగా మాట్లాడకు. కామిని వ్యవహారాలేమిటో? కథలేమిటో? నాకేం తెలుసు?''

''కానీ, లోకమంతా కోడై కూస్తోంది. నీ మాటలకే కలత చెంది కామిని ఆత్మహత్య చేసుకుందని అంటున్నారు.''

''అందుకే లోకులు కాకులు అన్నారు.''

''లోకులే కాదు పోలీసులు కూడా అదే మాట అంటున్నారు'' అంటూ అక్కడికొచ్చాడు ఎస్ఐ శివాజీ గైక్వాడ్.

పోలీసులను చూస్తూనే అంజలి భయంతో ''నిజంగా నాకేం తెలియదు'' అంది.

''నీకు మరో విషయం కూడా తెలియదు'' అన్నాడు ఎస్ఐ.

''ఏమిటా విషయం?''

''కామినిది ఆత్మహత్య కాదు''


''మరి?'' ఒక్కసారిగా అంజలి, మనోజ్‌లు అన్నారు.

''హత్య....ఎవరో కామినిని దారుణంగా హత్య చేసారు.''

ఆ మాట వింటూనే సూది మొన కింద పడ్డా వినిపించేటంత నిశ్శబ్దం ఆవరించిందక్కడ.

ఆ నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ....

''ఓసారి ఈ పర్స్ చూడండి'' అంటూ ఓ పర్స్ అంజలికి అందించాడు.



ఆ పర్సును చూస్తూనే మరోసారి ఆశ్చర్యపోయింది అంజలి. ఆ పర్సును చేతిలోకి తీసుకుంటూ... ''అరే ఇది నాదే. మీ దగ్గరికెలా వచ్చింది?''

''మా దగ్గరకి రాలేదు. కామిని హత్య జరిగిన చోట దొరికింది.'' అన్నాడు ఎస్ఐ.

''నిజంగా..నాకే పాపం తెలీదు'' అంటూ ఏడవసాగింది అంజలి.

''ఇందులో నువ్వు భయపడాల్సింది ఏమీ లేదు. పర్సు దొరికింది కదా అని నీకు ఇవ్వడానికి వచ్చాం అంతే. జరిగిందంతా మరిచిపో..'' అన్నాడు ఎస్ఐ శివాజీ.

''థాంక్ గాడ్! నన్ను అరెస్ట్ చేస్తారేమోనని హడలి చచ్చాను'' అంది అంజలి.

''మళ్లీ అవసరమయితే కలుస్తాం'' అంటూ వెళ్లిపోయారు పోలీసులు.

* * *

ఎస్ఐ శివాజీ గైక్వాడ్ బిజీగా వున్న వేళ అతని సెల్ మోగింది.

సెల్‌లో మెసేజ్ చూస్తూనే జీపు తీసుకొని కోలాబా లోని మనోజ్ ఇంటికి బయలుదేరాడు శివాజీ. మనోజ్ ఇంటి ఆవరణలో గుమికూడి వున్న జనం పోలీసుల్ని చూస్తూనే లోపలికి దారి ఇచ్చారు.

ఇంటి ఆవరణలో రక్తపు మడుగులో అంజలి పడి వుంది.

హీరో కార్తీక్ అక్కడ విచారంగా కూర్చుని వున్నాడు. ఎస్ఐని చూస్తూనే ''రండి ఎస్ఐ గారు'' అంటూ శివాజీని పిలిచాడు.

అప్పుడే టీవీ ఛానళ్లు, ప్రెస్ వాళ్లు అక్కడకు చేరుకున్నారు. వెంటనే టీవీల్లో అంజలి మృతి గురించి లైవ్ ప్రసారాలు ప్రారంభమయ్యాయి.

''అసలేం జరిగింది?'' అడిగాడు శివాజీ.

''నేను రాత్రి షూటింగ్ ముగించుకొని ఈ దారి వెంట వస్తుంటే మొన్న తను జరిపిన ఇంటర్వ్యూలో కొన్ని మార్పులు సూచించాలని కారు ఇంటి ముందు ఆపాను. అప్పుడే అంజలి డాబా పై నుంచి దూకడం చూసాను'' అని చెప్పాడు కార్తీక్.

''నిన్నటి వరకూ కామినిని హత్య చేసింది అంజలి అని అనుమానించాం. మరి ఇప్పుడు హఠాత్తుగా అంజలి ఎందుకు మరణించాల్సి వచ్చిందో అర్థం కావడం లేదు. అవునూ అంజలి భర్త మనోజ్ వుండాలి కదా? ఎక్కడికెళ్లినట్లు?'' ప్రశ్నించాడు శివాజీ.

''అతనెక్కడికి వెళ్లాడో తెలియదు కానీ, అంజలి, మనోజ్‌ల మధ్య తీవ్ర మనస్పర్థలు వున్నాయి. కామిని చావుకు కారణం అంజలే అని భావిస్తున్నాడు మనోజ్'' అని చెప్పాడు కార్తీక్.

శవాన్ని నిశితంగా పరిశీలించాడు ఎస్ఐ శివాజీ. అంజలి డాబా పై నుంచి పడితే బోర్లా పడాలి కానీ, వెల్లకిలా పడే అవకాశం లేదు. ఎవరో ఎత్తి పడేసారని స్పష్టంగా తెలుస్తోంది. ఒక్కసారి తలతిప్పి చూశాడు ఎస్ఐ. టీవీ కెమెరాలన్నీ కార్తీక్ పైనే ఫోకస్ చేయబడి వున్నాయి. కార్తీక్ చెప్పే కథనాన్ని లైవ్ చేస్తున్నారు. ఎందుకో ఆ దృశ్యం అసహజంగా కనిపించింది ఎస్ఐ శివాజీకి.

ఇంట్లో ఎక్కడా మనోజ్ జాడ కనిపించలేదు. ఇక చేసేదేమీ లేక అంజలి శవాన్నిపోస్టుమార్టంకు పంపించాడు.

* * *

మరునాడు బాలీవుడ్ మ్యాగ్జిన్‌తో పాటు ముంబాయిలోని అన్ని పత్రికల్లో కార్తీక్ ఫోటో ప్రముఖంగా ప్రచురించారు. దాని కిందే అంజలి మరణం గురించిన కథనం చిన్నగా ప్రచురించారు.

వింతగా అనిపించింది ఎస్ఐకి.

ఈలోగా మనోజ్ ఎస్ఐని కలిసాడు. అంజలి మృతి చెందిన రోజున తాను ముంబాయిలో లేనని ఓ యాడ్ ఏజెన్సీ షూటింగ్‌కి గాను గోవాలో వున్నానని ఫ్లైట్ టిక్కెట్ చూపించాడు.

''సార్, మీకో ముఖ్య విషయం చెప్పాలి''అంటూ తను చెప్పాల్సిన విషయం చెప్పాడు మనోజ్.

ఈలోగా కామిని, అంజలి పోస్టుమార్టమ్ రిపోర్టులు వచ్చాయి. వాటిని జాగ్రత్తగా పరిశీలించాడు ఎస్ఐ. ఇద్దరూ గొంతు నులమడం వల్ల మరణించారు. ఇద్దరి గొంతుక మీద వేలి ముద్రలు ఒక్కరివే. చాలా వరకూ మిస్టరీ వీడినట్లనిపించింది. కార్తీక్‌ను పిలిపించాడు.

అరగంటకు కార్తీక్ అక్కడకు చేరుకున్నాడు. ఆశ్చర్యం. అతనితో పాటు ప్రైవేట్ టీవీ కెమెరామెన్‌లుకూడా వచ్చారు.

* * *

కార్తీక్ వస్తూనే...''సార్, హంతకుడు దొరికాడా?'' ఆదుర్దాగా అడిగాడు.

''తప్పకుండానే దొరుకుతాడు. కానీ, ముందీ విషయం చెప్పండి. మీ వెంట టీవి ఛానళ్ల వాళ్లెందుకు?'' ప్రశ్నించాడు.

''అదీ... అదీ...'' అంటూ తడబడ్డాడు కార్తీక్.

''నేను చెప్తా విను. ఇప్పుడిప్పుడే ఫీల్డ్‌లో అడుగుపెడుతున్న నీకు, పబ్లిసిటీ కావాలి. అలాగే తామర తుంపరగా వస్తున్న ఛానళ్లకు ఏదో ఒక మ్యాటర్ కావాలి. ఈ అవకాశాన్ని బాగా వినియోగించుకోవాలనుకున్నావు. నీ ముందే ఘర్షణకు దిగిన కామిని, అంజలిల వైరాన్ని చూసావు. నీ మెదడులో ఓ భయంకరమైన ఆలోచన రూపుదాల్చింది. పరిస్థితుల్ని నీకు అనుకూలంగా మార్చుకోవాలనుకున్నావు. నీ పేరు నలుగురిలో నానాలనుకున్నావు. నీ ఆలోచనను అమలు జరిపావు. ముందుగా కామినిని మట్టుబెట్టావు. కంప్యూటర్‌లో సూసైడ్ నోట్ ప్రిపేర్ చేసావు. నువ్వూహించినట్లుగానే టీవీ ఛానళ్లు బాగానే కవర్ చేశాయి. నీలో దురాశ పెరిగింది. అంజలిని కూడా హత్య చేసి డాబా పై నుంచి పడేసావు. ఆరోజు నువ్వు ఏ షూటింగ్‌లో లేవు. నీ ప్రొడ్యూసర్ల నందరినీ విచారించాం. ఆ రాత్రి అంజలి ఇంటికి వస్తానని కాల్ చేసావు. అదే విషయం అంజలి గోవాలో వున్న మనోజ్‌కు తెలిపింది. అంతేకాదు. కామిని గొంతు మీద, అంజలి గొంతు మీద వేలి ముద్రలు ఒక్కరివే. ఆ వేలిముద్రలు నీవే'' అని ఎస్ఐ శివాజీ ఆరోపించేసరికి నిరుత్తరుడయ్యాడు కార్తీక్.

ఇదంతా టీవీలో లైవ్ ప్రసారమయ్యింది. ఇంత త్వరగా తన నేరం బయటపడుతుందనుకోలేదు. కార్తీక్ తలొంచుకున్నాడు. పోలీసులు అరెస్ట్ చేసారు. తారాజువ్వలా వెలిగిపోవాలనుకున్న కార్తీక్ తోకచుక్కలా పడిపోయాడు.

అంతే త్వరగా తెరమరుగయ్యాడు.

కేసు విచారణలో వుంది.

◆

